క్లుప్తంగా

8న హుండీ కానుకల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నవంబర్ 8వ తేదీ హుండీ కానుకలను లెక్కించనున్నట్లు దేవస్థానం ఈవో సాగర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని ప్రధాన,పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయ బృందం సత్కరించింది. రమేష్‌బాబు దంపతులను ఎంఈఓ మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథం పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

ఏర్పేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందించే దిశగా కృషిచేస్తున్నట్లు సర్పంచ్ లలిత అన్నారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేటలో హర్‌ఘర్‌జల్ ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి సురక్షిత తాగునీటిని అందించనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కరుణాకరణ్, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగా రాష్ట్ర పోటీలకు..



పోటీలకు బయలుదేరుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. పశ్చిమగోదావరిలో నిర్వహించే యోగా తరగతులకు మంగళవారం వారు బయలుదేరినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగ మేళాలో 35 మంది ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం జేకేసీ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగిన మినీ జాబ్‌మేళాలో 35మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. కాంటినెంటల్ కాఫీ, అమరరాజా, డిక్సన్, గ్రీన్‌టెక్, శ్రీజ పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం 187మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 35మంది ఎంపిక అయ్యారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. అధ్యాపకులు, అధికారులు, పరిశ్రమల నిర్వాహకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాదా బైనామా భూముల పరిశీలన

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి సాదాబైనామా భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఆర్‌డీఓ ఎస్.రవిశంకర్ రెడ్డి, డీఐ బాలకృష్ణ, ఏడీ జయరాజ్‌తో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. గోవర్ధనగిరి గ్రామానికి చేరుకుని భూముల రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు మధుసూదన్ రావు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, వీఆర్‌ఓ రూపేష్ తదితరులు పాల్గొన్నారు.





పిచ్చాటూరు: జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంఈఓ హేమమాలినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదర్శప్రాయుడు వల్లభాయ్‌పటేల్

పిచ్చాటూరు: విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయుడని, దేశరక్షణ, సమగ్రతకు ఆయనెంతో కృషిచేశారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం మాజీ ఉప ప్రధాని, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగిన జాతీయ ఐక్యతా దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో పోరాడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు మనిషిగా ప్రజలతో కీర్తినందుకున్నారని తెలిపారు. సంస్థానాలను విలీనం చేసి భారతీయులందరూ ఒక్కటి చేయడంలో కీలక పాత్రను పోషించారన్నారు. చివరగా విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమైక్యతను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే సత్కారం

హైదరాబాద్ ఎల్డర్స్ క్లబ్స్, లైయన్స్ క్లబ్ సంస్థ ద్వారా సేవా నంది అవార్డు అందుకున్న ఎంఈఓ హేమమాలినీని, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గజసింగరాజపురం టీచర్ బాలాజీని ఎమ్మెల్యే సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల జగనన్న ప్రభుత్వ హాయంలో నాడు–నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీరిదిద్దారన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ–2 యుగంధర్ రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ భాస్కర్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, సర్పంచ్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పమే అభివృద్ధికి పునాది

శ్రీకాళహస్తి: దేశ ఐక్యత కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజకుమారి అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలోని 565 సంస్థానాలను ప్రభుత్వంలో విలీనం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ఏర్పాటు చేసి ఏకతాటిపై నిలిచేలా చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శనీయుడని అన్నారు. ఉపాధ్యాయుల సురేష్, రమేష్, శాంతి, మల్లికార్జున, వరలక్ష్మిన రజియా, రమేష్‌రెడ్డి, అనూష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

● శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఆయన ఉప ప్రధానిగా సంస్థానాల విలీనం కోసం చేసిన సేవలను వివరించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

శ్రీకాళహస్తి పట్టణంలోని పాతబస్టాండు వద్ద మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గరికపాటి రమేష్‌బాబు, వాసుయాదవ్, డిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు మండలంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ కేసీరేణుకమ్మ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ దేశ ఐక్యతకు, సమగ్రతకు వల్లభాయ్ పటేల్ విశేషంగా కృషి చేశారని తెలిపారు. అనంతరం సమైక్యతను కాపాడుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అలాగే మండలంలోని దిగువసాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు.

మడిబాకలో ర్యాలీ

ఏర్పేడు: మండలంలోని మడిబాకలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం భారతదేశ సమైక్యత దినోత్సవం సందర్భంగా ర్యాలీ జరిగింది. విద్యార్థులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త విజయ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏక్తా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నాదెండ్లమురళి మాట్లాడుతూ పటేల్ స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు దేశంలో విలీనం చేసి దేశాన్ని ఒక తాటిపైకి తెచ్చారని తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.



శ్రీకాళహస్తి: జాతీయ జెండాల ప్రదర్శన



బీఎన్‌కండ్రిగ: విద్యార్థుల ర్యాలీ

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం బొక్కిసంపాళెం గ్రామంలో వెలసిన శ్రీకామాక్షాంబ సమేత కోదండ రామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను మంగళవారం దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీరింగ్‌శాఖ అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ఈ ఆలయాన్ని త్వరితగతిన అభివృద్ధి చేస్తామన్నారు. అమ్మవారి సన్నిధి ముందు ముఖమండపం, ఆలయ ప్రాకార నిర్మాణం, వినాయస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, నూతన నాగశిలల ప్రతిష్ఠతో సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

రైతులకు అందుబాటులో ఎరువులు



వరి సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మంగళవారం తొట్టంబేడు మండలం బోనుపల్లి రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు కావలసిన ఎరువులు ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో రబీలో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. ఏడీఏ (ప్లాంట్ ప్రొటెక్షన్) ధనుంజయ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర రెడ్డి, వీఏఏ లక్ష్మణ్ పాల్గొన్నారు.

డాక్టర్ నిఖిలేష్‌కు యంగ్ అచీవర్ అవార్డు



రేణిగుంట: గార్డెన్ సిటీ యూనివర్సిటీ బెంగళూరులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నిఖిలేష్ యంగ్ అచీవర్ అవార్డును అందుకున్నారు. రేణిగుంట మండలం జీవాగ్రంకు చెందిన దాసరి దీనదయాళ్, లలిత వసంతకుమారిల కుమారుడు నిఖిలేష్‌ను ఫోని ఎక్సర్ సంస్థ ఆదివారం బెంగళూరులో అవార్డుతో సత్కరించింది. నిఖిలేష్ ఫిజియోథెరఫీ విభాగంలో భుజం, కైనిసియా టేప్‌లకు సంబంధించి చేసిన పరిశోధనలకు ఈ అవార్డు లభించింది. ఈయన పరిశోధనలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ రీసెర్చ్ వారు 2022లో, యూరోపియన్ కెమికల్ సంస్థ 2023లో తమ మ్యాగజైన్లలో ప్రచురించారు. నిఖిలేష్‌ను జీవాగ్రం సెయింట్ లూక్ లూథరన్ చర్చి ఫాస్టర్ కెపి లూథరన్‌బాబు, స్థానికులు అభినందించారు.

జగనన్న సురక్ష...పేదలకు శ్రీరామరక్ష

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 345 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈకార్యక్రమం పేదలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ఎంపీడీఓ గిడ్డయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య, యాదవ్, సర్పంచ్ మంజుల, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మందుల కిట్లు అందుకున్న గ్రామస్తులు

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

నాగలాపురం : మండలంలోని కాళంజేరి గ్రామానికి చెందిన మునస్వామి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భరోసా ఇచ్చారు. మంగళవారం మునస్వామి కుటుంబానికి రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఆరు నెలల కిందట మునస్వామి నాగలాపురంలో హత్యకు గురయ్యారు. కాళంజేరి గ్రామానికి చేరుకుని మృతుని భార్య మౌనిక, పిల్లలు శ్రీధర్ గౌతమికి చెక్కును అందించారు. పిల్లలను చదివించడంతో పాటు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సంఘం అధ్యక్షులు చిన్నదొరై, ఎంపీడీఓ బాబు, వీఆర్వో డేవిడ్, సర్పంచ్ మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

రేణిగుంట: అమరరాజ సంస్థ సహకారంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూతలపట్టు మండలం పేటమిట్టలో నిర్వహిస్తున్న అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ప్రతినిధి వి.కల్యాణ్ శనివారం తెలిపారు. 33వ బ్యాచ్‌కు ఇవ్వనున్న శిక్షణకు సంబంధించి నవంబర్ 4వ తేదీలోపు అడ్మిషన్లు పొందాలన్నారు. టెన్త్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మొదటి మూడు నెలలు రూ.7,500, తర్వాత 21 నెలలపాటు రూ.11,453 నుంచి రూ. 11,853 వరకు ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. మొత్తం రెండేళ్లపాటు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుందని తెలియజేశారు. పూర్తి వివరాలకు 90000 24919, 9100477371 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జూడో రాష్ట్ర పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

రేణిగుంట: సత్యసాయి జిల్లా చిగిచేర్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు 8మంది పాల్గొనగా, ఒకరికి, స్వర్ణం, ముగ్గురికి రజిత పతకాలు అందినట్లు హెచ్‌ఎం విష్ణువర్ధనం తెలిపారు. అండర్–19 విభాగంలో జూనియర్ ఇంటర్ చదువుతున్న సంజన బంగారు పతకం, భారతి రజిత పతకాలను సాధించారు. అలాగే అండర్–14 విభాగంలో 7వ తరగతికి చెందిన శ్రీవల్లి రంజిత, అండర్–17 విభాగంలో జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థిని రాజేశ్వరి రజిత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. మంగళవారం స్కూల్ ఆవరణంలో ప్రతిభ చూపిన విద్యార్థినులను హెచ్‌ఎంతోపాటు పీడీ రేఖారాణి, సిబ్బంది అభినందించారు.

పొదుపు సంఘాలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న మాక్స్ సీఈఓ దశరథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని చెంచులక్ష్మి యానాది మహిళా సంక్షేమ పరస్పర సహకార సంఘం అధ్యక్షురాలు అనితాలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చెంచులక్ష్మి సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మాక్స్ సీఈఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనితాలక్ష్మి, మాక్స్ సీఈఓ దశరథ్ మాట్లాడుతూ సంఘాన్ని బుచ్చినాయుడుకండ్రిగలో 2005లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, తిరుపతి, ఏరియాలలోని 182 మహిళా సంఘాలను ఏర్పాటు చేయగా, అందులో 1,493 మంది సభ్యులున్నారని, రూ.2 కోట్ల 10 లక్షలను రుణాలుగా అందించామని తెలిపారు. మాక్స్ సీఈఓ విశ్వనాథ్, సర్పంచ్ వెంకటమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్గుమూడి గురునాథం, సభ్యులు లలితమ్మ, రాజారెడ్డి, నాగరాజు, ప్రజాప్రగతి ట్రస్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.